ఎర్రబెల్లికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బీఆర్ఎస్ మండల నాయకులు

మాజీ మంత్రి ఎర్రబెల్లికి బెస్ట్ ఆఫ్ లక్

దేవరుప్పుల, మే 27: బీఆర్ఎస్ గ్లోబెల్ ఎన్నారై సెల్ నేతృత్వంలో జూన్ 1న అమెరికాలోని డల్లాస్‌లో నిర్వహిస్తున్న పార్టీ రజతోత్సవ వేడుకలకు వెళ్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును పార్టీ మండల నాయకులు మంగళవారం హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిశారు. ఎర్రబెల్లికి పుష్పగుచ్ఛాలు అందించి బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. ఎర్రబెల్లిని కలిసిన వారిలో బీఆర్స్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, మండల నాయకులు బస్వ మల్లేశ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ కారుపోతుల భిక్షపతి, జిల్లా యూత్ నాయకుడు కోతి ప్రవీణ్, నియోజకవర్గ సోసల్ మీడియా ఇన్‌చార్జి వడ్లకొండ వినయ్, నాయకులు పరుశరాములు తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాలి

దేవరుప్పుల, మే 27: 35 ఏండ్లలోపు వితంతులైన మహిళలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయానికి మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయాలని తహసీల్దార్ ఆండాలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం వితంతువులను ఆర్థికంగా ఆదుకునేందుకు నూతన పథకం ప్రవేశ పెట్టిందని తెలిపారు. దీనికి అర్హులైన వారు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసి, దాని హార్డ్ కాపీని తహసీల్ కార్యాలయంలో ఉండజేయాలని ఆండాళు అన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాతృనాయక్

ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయించాలి

బచ్చన్నపేట, 27: పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయించాలని హౌసింగ్ పీడీ మాతృనాయక్ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై మండల కేంద్రంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాతృనాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అవకతవకలు జరగకుండా చూడాలని కోరారు. దళారుల చేతులో లబ్ధిదారులు మోసపోకుండా పం చాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీసీ అభివృద్ధిశాఖ అధికారి రవీందర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా గుర్తించాలి

జనగామ చౌరస్తా, మే 27 : రాజీవ్ యువ వికాసం పథకానికి సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా లబ్ధిదారులను గుర్తించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా బీసీ అభివృద్ధిశాఖ అధికారి రవీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో సిబిల్ స్కోర్‌కు సంబంధం లేదని ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తు చేశారు. అయినా అధికారులు బ్యాంకులకు వెళ్లి దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్‌ను తనిఖీ చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం దృష్టికి వచ్చిందన్నారు. అర్హులైన ప్రతిఒకరు స్వయం ఉపాధితో ఆర్థిక ప్రగతి సాధించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దూడల సిద్ధయ్య, రవిందర్, శ్రీనివాస్, మధు, సత్యనారాయణ, సమ్మయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందాలి

బచ్చన్నపేట, మే 27: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసి అధిక దిగుబడుల సాధించాలని వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గత సంవత్సరం కంటే ముందే రుతుపవనాలు వస్తున్నందున వరి, పత్తి, ఇతర పంటలను సకాలంలో సాగు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ షాపుల్లో డీలర్లు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించి వాటికి సంబంధించిన రశీదును ఇవ్వాలన్నారు. జీలుగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాకర్‌రెడ్డి కోరారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
jobs Apply Now!
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచింపడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

- సెక్రటేరియట్‌కు వెళ్లకుండా అడ్డుకున్న కాంగ్రెస్ సర్కారు
- పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మాజీ సర్పంచ్‌ల డిమాండ్

బచ్చన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

జనగామ పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

దేవరుప్పుల, మే 27: గ్రామపంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు చేపట్టిన చలో సెక్రటేరియట్‌ను పోలీసులు అడ్డుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకే మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. దేవరుప్పుల మం డలం నల్లకుంట తండా మాజీ సర్పంచ్ బానోత్ రాజన్న, సింగరాజుపల్లి మాజీ సర్పంచ్ గోపాల్దాస్ మల్లేశ్, మన్‌పహాడ్ మాజీ సర్పంచ్ వర్రె మధు యాదవ్, రామరాజుపల్లి మాజీ సర్పంచ్ బండి నర్సింహులును పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా వీరికి సంఘీభావంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ కారుపోతుల భిక్షపతి పోలీస్‌స్టేషన్ వెళ్లి వారిని కలిశారు. మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలన్నారు. .

నర్మెటలో..

నర్మెట : గ్రామాల అభివృద్ధి కోసం వెచ్చించిన నిధులు విడుదల చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరేందుకు వెళ్తుంటే మాజీ సర్పంచ్‌లను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని సర్పంచ్‌ల ఫోరం నర్మెట మండల మాజీ అధ్యక్షుడు ఆమెడపు కమలాకర్‌రెడ్డి, రామిని శివరాజ్ విమర్శించారు. నర్మెట పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల చేస్తున్నదని మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధికి మాజీ సర్పంచ్‌లు బంగారం, ఆస్తులు కుదవ పెట్టి అప్పులు చేశారని తెలిపారు. ఇప్పటికైనా బిల్లులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్ర వెంకట రమణారెడ్డి, జాల శ్వేతాకిషన్, పండుగ మల్లేశం, పగడాల విజయ నర్సయ్య, కిరణ్, లాలు, పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట : గ్రామాల అభివృద్ధి కోసం మాజీ సర్పంచ్‌లు వెచ్చించిన నిధులను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డి అన్నారు. బచ్చన్నపేట ఠాణా లో ఉన్న మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరు తూ మాజీ సర్పంచ్‌లు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు వెళ్తుంటే పోలీసులు ముందస్తు అరెస్ట్ చేయడం బాధాకరమని అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేశామని సర్కారు ప్రకటన చేస్తూ చేతులు దులుపుకుంటున్నదని విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసిన మాజీ సర్పంచ్‌లకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

నర్మెట పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో సెక్రటేరియట్ చేపట్టిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల ఫోరం జనగామ మండల మాజీ అధ్యక్షులు బొల్లం శారద మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేశామని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పత్రికా ప్రకటనలు చేసినా నేటికీ నిధులు అందలేదన్నారు. ఇలాంటి మోసపురిత ప్రకటనలు మాని నిధులు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని బొల్లం శారద హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు శానబోయిన శ్రీనివాస్, ఎర్ర సుజాత పాల్గొన్నారు.

రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ సర్కారు

దేవరుప్పుల, మే 27: రైతాంగానికి సేవ లందించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మహ్మద్ అబ్బాస్ ఆరోపించారు. సీపీఎం జనగామ-హైదరాబాద్ సౌత్ జిల్లాల స్థాయి శిక్షణా శిబిరాలు మంగళవారం మండల కేంద్రంలో ప్రారంభమయ్యాయి. జిల్లా నాయకుడు సింగారపు రమేశ్ పార్టీ జెండాను ఆవిష్కరించగా అబ్బాస్ మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన తరుణంలో పత్తి విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడంలో సర్కారు విఫలమైందన్నారు. ఎరువుల దుకాణాల వద్ద రైతుల క్యూలైన్లు కనిపిస్తున్నాయని, కొనుగోలు కేంద్రాల్లో వర్షాలకు వడ్లు తడిసిపోతున్నాయని ఆయన వివరించారు. అయినా ప్రభుత్వం , రైస్ మిల్లర్లు చోద్యం చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలోని ఎఫ్‌సీఐ స్పందించడంలేదన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యురాలు ఇర్ర అహల్య, సాంబరాజు యాదగిరి, రాపర్తి రాజు, రాపర్తి సోమయ్య, బొల్ల శేఖర్, మండల నాయకులు రెడ్డిరాజుల నారాయణ, గడ్డం యాదగిరి పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం నేత అబ్బాస్

30న కలెక్టరేట్‌లో జాబ్ మేళా

జనగామ చౌరస్తా, మే 27 : జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 30వ తేదీన ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి పీ సాహితి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌కు చెందిన అపోలో ఫార్మసీ, లోటస్ కంపెనీలో ఫార్మసిస్ట్/ఫార్మసి అసిస్టెంట్/రిటైల్ అసోసియేట్, ఎలక్ట్రానిక్స్/మెకానిక్స్/టెక్నీషియన్స్ పోస్టుల నియామకాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్స్, బయోడేటాతో హాజరుకావాలని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నిరుద్యోగ అభ్యర్థులు కూడా జాబ్‌మేళాకు హాజరుకావొచ్చని సాహితి సూచించారు. వివరాలకు సీనియర్ అసిస్టెంట్ జే గీతను సెల్ నంబర్ 79954 30401లో సంప్రదించాలని సూచించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

జనగామ చౌరస్తా, మే 27 : జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో మంగళవారం 8, 10, 12 ఏళ్ల వయసున్న బాల బాలికలకు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. దీనికి సంబంధించిన వివరాలను అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్ కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 150 మంది బాల బాలికలు పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వచ్చే నెల 1వ తేదీన హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి 20 మంది బాల బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీల్లో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కోశాధికారి ఆవుల అశోక్, రంజిత్, కుమార్, దిలీప్, నీల, వేణు, రాజు, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి : కావ్య

స్టేషన్ ఘన్‌పూర్, మే 27 : నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తమపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నెలబెట్టుకుంటామని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, జఫర్‌గఢ్ మండలాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు రూ.32,82,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కావ్య పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ దేవాదుల ద్వారా ప్రతి ఎకరాకు గోదావరి జలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏడాది కాలంలోనే నియోజకవర్గంలో రూ.800 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి వెం ట సర్వీస్ రోడ్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిని, సంబంధిత శాఖ అధికారులను కలిసి వివరించగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ జూలుకుంట్ల లావణ్యా శిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, నాయకులు చింతకుంట్ల నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, రాజేశ్ నాయక్, అంబటి కిషన్ రాజు, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కనకం రమేశ్, కొలిపాక సతీశ్, గన్ను నర్సింహులు, మండల రాకేశ్, మంద మల్లేశం, జీడి ప్రసాద్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న కడియం కావ్య

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే రాజయ్య పరామర్శ

జఫర్‌గఢ్, మే 27: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు కుక్కల రాఘవులు అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మంగళవారం రాఘవులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీధర్, కృష్ణ పాల్గొన్నారు.

రఘునాథపల్లిలో..

రఘునాథపల్లి : మండలంలోని కోడూరుకు చెందిన కాసగాని యాకయ్య (40) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో జనగామ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జఫర్‌గఢ్‌లో మృతుడి కుమారులతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

కొనుగోలు కేంద్రంతో రైతులకు మేలు

జనగామ చౌరస్తా, మే 27 : జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం స్థానిక రైతులకు ఉపయోగపడిందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ (ఏఎంసీ) బనుక శివరాజ్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జనగామ వ్యవసాయ మార్కెట్ పత్తి యార్డులో ఉన్న చీటకోడూరు ఐకేపీ ధాన్యం కొనుకోలు కేంద్రంలో మంగళవారం చివరి లారీ ద్వారా ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఇప్పటి వరకు 152 లారీలు, 95,434 బస్తాల ధాన్యాన్ని మిల్లులకు తరలించినట్లు పేర్కొన్నారు. ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వం తరపున కొనుగోలు చేస్తామని శివరాజ్‌యాదవ్ తెలిపారు.

కళాజాత ప్రదర్శిస్తున్న పోలీసు బృందం

పోలీసు కళాజాత

రఘునాథపల్లి, మే 27: వరంగల్ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం రాత్రి కళాజాత నిర్వహించారు. విద్య ప్రాముఖ్యత, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాల నిర్మూలన, సీసీ కెమెరాల ఏర్పాటు, గుట్కా, గంజాయి వంటి మత్తు పదార్థాల నివారణపై కళా బృందం ఆటపాటలతో అవగాహన కల్పించారు. ఏఎస్సై కట్టుమల్లు మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండి తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలా సూచించారు. ప్రమాదంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితిల్లో 100 నంబర్‌కు డయల్ చేస్తే వెంటనే పోలీసులు చేరుకొని రక్షిస్తారని తెలిపారు. కళాబృందం సభ్యు లు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొన్న లారీ

చిల్పూరు, మే 27 : వరంగల్-హైదరాబాద్ హైవేపై మండలంలోని చిన్నపెండ్యాల శివారులోని ఆకేరువాగు బ్రిడ్జిపై మంగళవారం తెల్లవారుజామున లారీ అదుపు తప్పి రెయిలింగ్‌ను ఢీకొంది. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు మద్యం లోడ్‌తో లారీ వస్తున్నది. డ్రైవర్ మద్యం మత్తులో ఉండడంతో లారీ అదుపుతప్పి బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొని నిలిచిపోయిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని వారు పేర్కొన్నారు.

అదుపుతప్పి ఢీకొన్న లారీ

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో భారీ వర్షం

పంటలకు సాగుకు రైతులు సన్నద్ధం

స్టేషన్ ఘన్‌పూర్/జఫర్‌గఢ్/చిల్పూరు, మే 27 : నైరుతి రుతుపవనాల ప్రభావం నేపథ్యంలో ఈసారి ఎప్పుడూ లేని విధంగా రోహిణి కార్తెలోనే ముందస్తుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూ రు, జఫర్‌గఢ్ మండలాల్లో సుమారు రెండు గంటల పాటు వర్షం కురవడంతో దుక్కులు దున్నిన చెలకలు, పొలాలు నీటితో నిండాయి. దీంతో పంటల సాగు వాతావరణం అనుకూలంగా మారిందని రైతులు చెబుతున్నారు. పత్తి విత్తేందుకు సన్నద్ధమవుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

చిల్పూరు మండల కేంద్రంతోపాటు పల్లగుట్టలోని ఐకేపీ, పీఎస్‌సీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. కొన్ని ధాన్యం రాసులు నీటిపాలయ్యాయి. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం, లారీల్లో మిల్లులకు పంపకపోవడంతో ధాన్యం తడిసిందన్నారు.



శివునిపల్లిలోని పంట పొలాల్లో కురుస్తున్న వర్షం

వర్షాలతో ఆనందంగా ఉంది..
-లోనే నాగేశ్వర్‌రావు, సాగరం రైతు

ఈసారి రోహిణి కార్తెలో వర్షాలు కురవడం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో జూన్ నెలలోనూ వర్షాలకు ఎదురు చూసేవారం. దీంతో పంటల సాగుకు ఇబ్బంది ఉండేది. ఈ యేడాది వానలు తొందరగా కురవడం వరుణ దేవుడి కరుణగా భావిస్తున్నాం. ముందు పత్తిని సాగు చే స్తాం. మిగిలిన పంటలు సాగుకు మేము సిద్ధమవుతున్నం.

చిల్పూరు కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

చౌదర్‌పల్లిలో సీసీ రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగునీరు

పసరమడ్లలో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు

సీసీ రోడ్డుపై నుంచి పారుతున్న మురుగునీరు

జనగామ రూరల్, మే 27 : మండలంలోని పసరమడ్ల శివారులోని చౌదర్‌పల్లిలో సీసీరోడ్డుపై నుంచి మురుగునీరు పారుతున్నది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు బజారు నుంచే బయటకు వస్తుండడంతో దుర్వాసన వెలువడుతున్నది. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. రోడ్డుపైనే మురుగునీరు పారుతుండడంతో రోగాల భారీన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీరు సీసీ రోడ్డుపై నుంచి పారుతుండడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రంలో అవకతవకలపై విచారణ

బచ్చన్నపేట, మే 27 : మండలంలోని పోచ్చన్నపేట ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఆవకతవకలపై ఆరోపణలు రావడంతో మంగళవారం అధికారులు విచారణ జరిపారు. ఈ విషయమై పలువురు రైతులు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో నయాబ్ తహసీల్దార్ ఫణికిశోర్, ఎంఆర్ఐలు వంశీకృష్ణ, మున్వర్, డీటీ దేవాసింగ్, ఏసీఎస్‌వో ఇర్ఫాన్ విచారణ చేపట్టారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం బస్తాలను ఓ ప్రైవేట్ వ్యాపారి విక్రయిస్తున్నారని ఆరోపణలొచ్చాయి. కేంద్రంలో చివరి లారీ వద్ద 150 బస్తాలు ఉండగా వాటిని స్థానిక రైస్‌మిల్లుకు అధికారులు తరలించారు. కాశీనగర్‌కు చెందిన రైతు చొప్పరి కొమురయ్య ధాన్యం బస్తాలు తనవేనని మా అమ్మ చనిపోవడంతో ఇక్కడికి రాలేకపోయానని అధికారులకు తెలిపారు. కానీ ఆ రైతును పట్టాదారు పాస్ పుస్తకంతో అదనపు కలెక్టర్ వద్దకు వెళ్లాలని అధికారులు సూచించారు. అదనపు కలెక్టర్‌కు ధాన్యం కొనుగోలులో అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేసిన విషయంలో ఎలాంటి వాస్తవం లేదని రైతులు తీర్మానం చేసి అధికారులకు అందించారు. దీంతో గొడవ సద్దుమణిగింది.

తాటికొండలో రైతులతో మాట్లాడుతున్న ఏవో చంద్రన్‌కుమార్

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించాలి

స్టేషన్ ఘన్‌పూర్, మే 27 : పంటల సాగుకు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు రైతులు పొందాలంటే భూమి ఉన్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి, మండల వ్యవసాయాధికారి చంద్రన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటికొండలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వారు పరిశీలించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో సొంత భూమి కలిగిన రైతులకు 11 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తారన్నారు. ఇది డిజిటల్ గుర్తింపు కార్డు అని, దీనిని ఆధార్ కార్డుతో లింక్ చేస్తారని తెలిపారు. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ సమ్మాన్ నిధి, సాయిల్ హెల్త్ కార్డు, ఫసల్ బీమా యోజన వంటి పథకాలకు ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్